
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం ၊ 2 ၊ ఆగస్టు ၊ 2025



సోమశిలలో 33.55 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో శుక్ర వారం సాయంత్రానికి 33.55 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 13,453 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.1,01,020
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,150
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,424
నవర (8 గ్రాములు)	రూ.75,392

గరిష్టం/కనిష్టం
38.0 /29.0

వాతావరణం

జిల్లాలో వాతావరణంలో శనివారం మార్పేమీ ఉండదని అధికారులు తెలిపారు. గాలిలో తేమ 47 శాతంగా శుక్రవారం నమోదైంది.

న్యూస్‌రీల్

వక్ఫ్ బోర్డు చైర్మన్ ఏకవచన సంబోధన

- మండిపడిన దర్గా సిబ్బంది, భక్తులు
- చిన్న దర్గా నిర్వాహకులంతా దొంగలేనంటూ వ్యాఖ్యలు

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాను వక్ఫ్ బోర్డు రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ అజీజ్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని ఏకవచనంతో సంబోధించడం భక్తులను విస్మయానికి గురిచేసింది. చిన్న దర్గా నిర్వాహకులంతా దొంగలేనని వ్యాఖ్యానించడం వివాదానికి దారితీసింది. ఆయన తీరుపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం శిథిలావస్థకు చేరుకున్న దర్గా అద్దె గదులు, అన్నదాన సత్రాన్ని పరిశీలించారు. భోజనాన్ని రుచి చూసి మరింత నాణ్యతగా ఉండాలని సూచించారు. దర్గాలోని వాటర్ ప్లాంట్, సులభ్ కాంప్లెక్స్‌తో పాటు పరిసర ప్రాంతాలను పరిశీలించారు.

జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు నేడు

నెల్లూరు(పొగతోట): నగరంలోని జెడ్పీ కార్యాలయంలో స్థాయీ సంఘ సమావేశాలను శనివారం నిర్వహించనున్నామని సీఈఓ మోహన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన ఏడు స్థాయీ సంఘ సమావేశాలను ఉదయం 10.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించనున్నామని వివరించారు. జెడ్పీ సభ్యులు, ఆయా శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో నెల్లూరు నేతలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో జిల్లాకు చెందిన పలువురికి చోటు లభించింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులను శుక్రవారం జారీ చేసింది. బీసీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా గూడూరు నియోజకవర్గానికి చెందిన కనుపూరు జగదీష్, పబ్లిసిటీ వింగ్ రాష్ట్ర సెక్రటరీగా కోవూరు నియోజకవర్గానికి చెందిన కొట్టె మల్లికార్జున, సోషల్ మీడియా వింగ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా సర్వేపల్లి నియోజకవర్గానికి చెందిన ఆవుల తులసీరామ్‌యాదవ్‌ను నియమించారు.


రాష్ట్ర ఉపాధ్యాయ అవార్డులకు ప్రతిపాదనలు

నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ఉపాధ్యాయ అవార్డులకు ప్రతిపాదనలను పంపాలని డీఈఓ బాలాజీరావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. వీటిని సంబంధిత ఉప విద్యాశాఖాధికారులకు ఈ నెల ఎనిమిదిలోపు సమర్పించాలని పేర్కొన్నారు. వివరాలకు www.deo.nellore.50webs.comను సంప్రదించాలని సూచించారు.

ఎంపీటీసీ ఎన్నికకు వైఎస్సార్‌సీపీ దూరం

విడవలూరు: విడవలూరులోని బిట్ – 1 ఎంపీటీసీ ఎన్నికలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దూరంగా ఉండనుందని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోవూరు నియోజకవర్గంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిణామాల దృష్ట్యా.. కార్యకర్తలపై జరుగుతున్న దాడులతో పాటు డబ్బును పంచడం తగదనే ఉద్దేశంతో ఈ ఎన్నికకు దూరంగా ఉండాలని నిర్ణయించామని చెప్పారు. అధైర్యపడాల్సిన అవసరం లేదని పార్టీ శ్రేణులకు సూచించారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా శోభారాణి



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారిత అధికారిగా పనిచేస్తున్న శోభారాణికి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ (ఎఫ్ఏసీ)గా బాధ్యతలు కల్పించారు. ఈ మేరకు ఉత్తర్వులను ప్రభుత్వం శుక్రవారం జారీ చేసింది. ఇప్పటి వరకు ఈడీగా అదనపు విధులను ఏపీఐపీ పీడీ శ్రీనివాసులు నిర్వర్తిస్తూ వచ్చారు.

అన్నదాత సుఖీభవకు కోత

మోసానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు అనే దానికి అన్నదాత సుఖీభవ పథకమే నిదర్శనం. గతంలో 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఆయన పనిచేసినా ఏనాడూ రైతాంగాన్ని ఆదుకునేందుకు ఒక్క పథకాన్ని అమలు చేసిన దాఖలాల్లేవు. వ్యవసాయమే దండగ అని విమర్శించిన ఆయన తిరిగి అధికారాన్ని చేజిక్కించుకునేందుకు రైతులకు రుణమాఫీ అంటూ గతంలో మోసం చేశారు. తాజాగా మరో దగాకు తెరలేపారు. నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని అన్నదాత సుఖీభవగా పేరు మార్చి ఏడాదికి రూ.20 వేలిస్తామంటూ ఎన్నికలకు ముందు హామీలు గుప్పించారు. అధికారం దక్కాక గతేడాది ఎగనామం పెట్టిన చంద్రబాబు ఈ ఏడాది వచ్చే సరికి నాలుక మడతేసి, పీఎం కిసాన్‌తో కలిసి ఆ మొత్తాన్ని ఇస్తామని చెప్పేశారు. కొర్రీలు పెట్టి గత ప్రభుత్వ హయాంలో ఉన్న లబ్ధిదారుల్లో వేలాది మందిని తొలగించారు. కౌలు రైతులను ఆదుకుంటానంటూ జాబితా నుంచే మాయం చేశారు.

బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ

- ఏటా రూ.20 వేలిస్తామని.. ఇప్పుడు పీఎం కిసాన్‌తో అంటూ దగా
- తొలి ఏడాది ఎగనామం.. రెండో ఏడాదిలో 28,299 మంది లబ్ధిదారులను లేపేశారు
- 3.19 లక్షల మంది రైతుల దరఖాస్తు
- 1,98,514 మంది లబ్ధిదారులని చెప్పిన వ్యవసాయ శాఖ అధికారులు
- తాజాగా 1,86,368 మంది అని తేల్చిన వైనం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో 2,14,667 మందికి లబ్ధి



వైఎస్సార్‌సీపీ పాలనలో ఇచ్చిన రైతు భరోసా — నాడు

సంవత్సరం	మొత్తం రైతులు	ఆర్థిక సాయం (రూ.కోట్లల్లో)
2019-20	2,02,306	273.11
2020-21	2,43,502	328.72
2021-22	2,43,911	329.27
2022-23	2,14,667	289.80
2023-24	2,14,667	289.80

నెల్లూరు(పొగతోట): కూటమి అధికారంలోకి వచ్చి అన్నదాతల ఆశలను చిదిమేసింది. ఆరుగాలం పండించిన పంటలకు ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కూడా దక్కక రైతులు తీవ్రంగా నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుపోయారు. సాగు పెట్టుబడిగా అన్నదాత సుఖీభవ పథకంతో ఏడాదికి రూ.20 వేలు ఇస్తామంటూ ప్రచారం చేసి తొలి ఏడాదిలోనే హామీని తుంగలో తొక్కేశారు. తాజాగా పీఎం కిసాన్ మొత్తాన్ని మినహాయించి రూ.14 వేలను మూడు విడతల్లో ఇస్తామని చంద్రబాబు ప్రకటించారు.

నిబంధనల కొర్రీలు.. లబ్ధిదారుల సంఖ్యలో కోతలు

అన్నదాతకు కూటమి ప్రభుత్వం గుండెకోత పెట్టింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ రైతు భరోసా పథకంలో లబ్ధిదారులుగా ఉండి లబ్ధి పొందిన రైతుల్లో 28,299 మందిని తొలగించారు. ఈకేవైసీ, ఆధార్‌లింక్, బ్యాంకు అకౌంట్ లింకు కాలేదంటూ తదితర కారణాలు చూపి జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో రైతులను అనర్హులుగా ప్రకటించారు. జిల్లాలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2,14,667 మంది రైతులకు వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని అందజేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక అన్నదాత సుఖీభవ పథకానికి జిల్లా వ్యాప్తంగా 3.19 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆర్టీజీఎస్ వ్యాలిడేషన్ తర్వాత అర్హులైన రైతులు 1,98,514 మంది లబ్ధిదారులను గుర్తించినట్లు స్వయంగా జిల్లా వ్యవసాయ అధికారిణి గత నెల 23న పత్రిక ప్రకటన విడుదల చేశారు. తాజాగా అధికారులు 1,86,368 మందిని అర్హులుగా తేల్చారు. కేవలం వారం రోజుల్లోనే ఫైనల్ చేసిన జాబితాల నుంచి 12,146 మంది లబ్ధిదారులను లేపేశారు.


వైఎస్సార్ రైతు భరోసా పథకం.. వైఎస్ జగన్ బ్రాండ్

చంద్రబాబు గతంలో 14 ఏళ్లు సీఎంగా ఉన్నప్పటికీ ఏనాడు అన్నదాతల కోసం ఎలాంటి పథకాన్ని అమలు చేయలేదు. ఆర్థికంగా ఆదుకున్నది లేదు. అధికారంలోకి వచ్చిన ప్రతి సారి రైతులను వంచనకు గురి చేసిన చరిత్ర చంద్రబాబుకు మాత్రమే ఉంది. 2004కు ముందు వ్యవసాయాన్ని నిర్వీర్యం చేశారు. వ్యవసాయమే దండగ అని వ్యాఖ్యానించిన చంద్రబాబు, 2014 ఎన్నికల్లో రైతులకు సంపూర్ణ రుణమాఫీ చేస్తానని నిలువునా మోసం చేశారు. తాజా ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన వైఎస్సార్ రైతు భరోసా పథకం పేరును అన్నదాత సుఖీభవ పథకంగా మార్పు చేసి ఆర్థిక సాయం అందిస్తామని చెబుతున్నారు. వైఎస్సార్ రైతు భరోసా పథకం వైఎస్ జగన్ బ్రాండ్‌గా చెప్పొచ్చు.

నేడు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్

నెల్లూరు రూరల్: రైతులకు పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకాన్ని అమలు చేస్తున్నారని కలెక్టర్ ఓ ఆనంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అన్నదాత సుఖీభవ మొత్తం 1,95,866 మంది అర్హులను గుర్తించినట్లు పేర్కొన్నారు. తొలివిడతలో 1,86,146 మందికి నిధులు విడుదల చేస్తున్నామని, మిగిలిన అర్హులైన లబ్ధిదారులు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తే వారికి సైతం నిధులిస్తామని తెలిపారు. మొదటి విడతలో రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు, పీఎం కిసాన్ కింద కేంద్రం రూ.రెండు వేల చొప్పున జమ చేయనున్నాయని చెప్పారు.

నిబంధనల మేరకే ఎంపిక



సాక్షి
1,98,514 మందికే అన్నదాత సుఖీభవ

లబ్ధిదారుల సంఖ్యను వెల్లడిస్తూ జూలై 23న జిల్లా వ్యవసాయశాఖాధికారి చేసిన ప్రకటన

అన్నదాత సుఖీభవ పథకానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారమే లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేశాం. వచ్చిన దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించి 1,86,368 మంది రైతులను జాబితాలో చేర్చాం. అర్హులు ఉంటే.. ప్రభుత్వ నిర్ణయాన్ని బట్టి తదుపరి చర్యలు తీసుకుంటాం. శనివారం రైతుల ఖాతాల్లో ప్రభుత్వం అన్నదాత సుఖీభవ నిధులను జమ చేయనుంది.

– సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

కుట్రలను ఛేదించి.. విజయవంతం చేశారు

- నిర్బంధాలను అధిగమించి వేలాదిగా తరలివచ్చిన అభిమానులు
- మాజీ సీఎం జగన్ పర్యటన గ్రాండ్ సక్సెస్
- విలేకరులతో వైఎస్సార్‌సీపీ నేతలు



మాట్లాడుతున్న ప్రసన్న, చిత్రంలో చంద్రశేఖర్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి, మేరిగ మురళి, పూజిత తదితరులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటనను అడ్డుకునేందుకు సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఎన్ని కుట్రలకు పాల్పడినా, ప్రజలు తిప్పికొట్టి విజయవంతం చేశారని పార్టీ నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళి, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె కాకాణి పూజిత తదితరులు విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. మాజీ సీఎం పర్యటనకు ప్రజలు రాకూడదనే దురుద్దేశంతో రోడ్లను తవ్వేయడం, జేసీబీలను అడ్డుపెట్టారని, ఇలాంటి పోకడలు దేశంలో ఎక్కడా లేదని మండిపడ్డారు. నిర్బంధాలను అధిగమించి వేలాదిగా ప్రజలు వచ్చారని, జగనన్నకు ఉన్న ఆదరణ ఏ పాటిదో దీని ద్వారా తెలుస్తోందన్నారు.

జిల్లా రాజకీయాలను భ్రష్టు పట్టించారు

కూటమి ప్రభుత్వం కొలువుదీరాక జిల్లా రాజకీయాలను భ్రష్టు పట్టించారని, పోలీసులిచ్చే నోటీసులను సంతోషంగా స్వీకరిస్తామని పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. అక్రమ కేసులను బనాయించి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని జైలుకు పంపారని.. ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై టీడీపీ గూండాలు దాడికి తెగబడ్డారని చెప్పారు. వీరికి అండగా నిలిచేందుకు జిల్లాకు జగన్‌మోహన్‌రెడ్డి వస్తుంటే, ఆయన్ను అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం చేయని యత్నం లేదని విమర్శించారు. ఆయన పర్యటనపై జిల్లా వాసులే కాకుండా దేశవ్యాప్తంగా రాజకీయాలతో సంబంధం ఉన్న చాలా మంది ఆసక్తిగా ఎదురు చూశారని తెలిపారు. జిల్లా కేంద్ర కారాగారం నుంచి ప్రసన్న నివాసం వరకు 7.7 కిలోమీటర్ల ప్రయాణంలో అడుగడుగునా జనాలు నీరాజనాలు పలికారని వివరించారు. చెట్లు.. గుట్టలతో ఉన్న ప్రాంతంలో అనుమతిస్తే, ఐదు రోజులు శ్రమించి హెలిప్యాడ్‌కు స్థలాన్ని సిద్ధం చేసుకున్నామని పేర్కొన్నారు. హెలిప్యాడ్, జైలు వద్ద పది మందికి మించి.. ప్రసన్న నివాసం వద్ద ఒక్కరూ ఉండకూడదని.. జగన్‌మోహన్‌రెడ్డితో పాటు మూడు వాహనాలకు మించి ఉండకూడదంటూ నిబంధన విధించారని, అయితే పోలీసులు మాత్రం 12 వాహనాల్లో వచ్చి ఆటంకాలు సృష్టించారని ఆరోపించారు. 35 రకాల కండీషన్లను పెట్టారని, ఎవరెవరు ఎక్కడెక్కడుంటారో జాబితా.. వాహనాల నంబర్లను ముందే ఇవ్వాలన్నారని, ఇదెక్కడి చోద్యమో అర్థం కావడంలేదని చెప్పారు. తమ పార్టీకి చెందిన మూడు వేల మంది నేతలకు నోటీసులిచ్చారని ధ్వజమెత్తారు. కార్యక్రమానికి ఎవర్నైనా తీసుకెళ్తే కేసులు పెడతామని బెదిరించారని, పార్టీ మహిళా నేతల ఇళ్లకు మహిళా కానిస్టేబుళ్లు లేకుండా అర్ధరాత్రి వెళ్లి నోటీసులను ఇచ్చారని మండిపడ్డారు. కార్యకర్తలు రాకుండా రోడ్లను బారికేడ్లతో నిర్బంధించి దాదాపు మూడు వేల మంది పోలీసులను మోహరించారని, జగన్‌మోహన్‌రెడ్డికి రక్షణ కల్పించాల్సింది పోయి అడ్డుకునేందుకే ఆసక్తి చూపారని విమర్శించారు.

కార్యకర్తలు వెనుకడుగేయలేదు

జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజల్లో ఉన్న అభిమానానికి నెల్లూరు పర్యటన ఓ ఉదాహరణ అని ఆనం విజయకుమార్‌రెడ్డి, మేరిగ మురళి పేర్కొన్నారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ లాఠీచార్జి చేసినా, తమ కార్యకర్తల మనోధైర్యం చెక్కుచెదరలేదని తెలిపారు. ప్రజాభిమానాన్ని చూసి కూటమి నేతలు ఓర్వలేక మీడియా ద్వారా వారి అక్కసును వెళ్లగక్కుతున్నారని విమర్శించారు.

జగనన్న భరోసా ఎంతో ధైర్యాన్నిచ్చింది

కష్టాల్లో ఉన్న తమ కుటుంబానికి జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇవ్వడం ఎంతో ధైర్యాన్నిచ్చిందని కాకాణి పూజిత పేర్కొన్నారు. దీనిపై కొన్ని పత్రికలు వక్రీకరించాయని, వారిని ఏమనాలో అర్థం కావడంలేదన్నారు. వేలాది మంది స్వచ్ఛందంగా తరలివచ్చారని చెప్పారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎలాంటి తప్పూ చేయలేదని, అక్రమ కేసులతో జైల్లో నిర్బంధించారనే విషయాన్ని ప్రజలు విశ్వసిస్తున్నారని చెప్పారు.

మహిళలపైనా లాఠీచార్జి

తమ పార్టీ నేతలు, కార్యకర్తలను హోమ్ మంత్రి, డీజీపీ, ఐజీ, ఎస్పీ పర్యవేక్షణలో నిర్బంధించారని ప్రసన్నకుమార్‌రెడ్డి ఆరోపించారు. ఏడాది పాలనకే చంద్రబాబులో భయం మొదలైందని విమర్శించారు. పోలీసులు ఖాకీ చొక్కాలను తీసేసి పచ్చ చొక్కాలు తొడుక్కొని టీడీపీ కార్యకర్తల తరహాలో వ్యవహరించారని ధ్వజమెత్తారు. ఒంగోలుకు చెందిన ఓ పోలీస్ తనపై లాఠీతో దాడి చేసి, గోళ్లతో రక్కి.. తిరిగి తనపైనే రెండు కేసులు పెట్టారని, అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ప్రెస్‌మీట్‌ను అడ్డుకునేందుకు పార్టీ కార్యాలయంపైకి టీడీపీ గూండాలను పంపారని, అయినా తాము ఆగిపోలేదని చెప్పారు.

నిధుల గోల్‌మాల్



- నేషనల్ హైవే నష్టపరిహారం, కాంట్రాక్ట్ పనుల రికవరీ సొమ్ము రూ.11 లక్షలకుపైగా స్వాహా
- దీర్ఘకాల సెలవుపై వెళ్లిన ఎంపీడీఓపై ఆరోపణలు

సీతారామపురం: మండలంలో విధులు నిర్వర్తిస్తూ దీర్ఘకాల సెలవుపై వెళ్లిన ఓ ఎంపీడీఓ ఏకంగా రూ.11 లక్షలకుపైగా నిధులను స్వాహా చేశారనే చర్చ మండలంలో కొన్ని రోజులుగా జరుగుతోంది. గతేడాది అక్టోబర్ 4న విధుల్లో చేరిన సదరు అధికారి.. ప్రభుత్వ నిధులకు సంబంధించి ఎలాంటి లెక్కల్లేకుండా తన అనుచరులతో డ్రా చేయించారని తెలుస్తోంది. స్థానిక కెనరా బ్యాంక్‌లో గల ఎంపీడీఓ పెన్షన్ ఖాతా నుంచి ఈ మొత్తాన్ని డ్రా చేయించారని సమాచారం. ఆయన విధుల్లో చేరాక పెన్షన్ అకౌంట్‌కు పలు విడతలుగా ట్రైనింగ్ డబ్బులు సుమారు రూ.1.6 లక్షలు.. 15వ ఆర్థిక సంఘ నిధులతో చేపట్టిన పనుల నుంచి మినహాయించిన రికవరీ మొత్తాలు సుమారు రూ.మూడు లక్షలను బదిలీ చేయించి.. చెల్లించకుండానే వాటిని స్వాహా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు గుండుపల్లి వద్ద నేషనల్ హైవే పనుల్లో భాగంగా పాఠశాల, పంచాయతీ భవనంతో పాటు, ఇతర ప్రభుత్వ ఆస్తులకు కలెక్టర్ మంజూరు చేసిన నష్టపరిహారం రూ. 39,42,534 జమయ్యాయి. వీటిని ఉన్నతాధికారుల ఆదేశానుసారం వినియోగించాల్సి ఉన్నా, అందులో రూ.ఆరు లక్షలను బొక్కేశారని సమాచారం. కాగా ఈ విషయమై కార్యాలయ ఏఓను సంప్రదించగా, నగదు లావాదేవీలను ఎంపీడీఓ స్వయంగా చూసేవారని, సిబ్బంది ప్రమేయం లేదని బదులిచ్చారు.

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

నెల్లూరు(టౌన్): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఆపస్, పీఆర్టీయూ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ బాలాజీరావుకు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఎంఈఓ – 1 పోస్టులను ఇవ్వరాదని కోరారు. బదిలీ చేసిన టీచర్లను వీలైనంత త్వరగా రిలీవ్ చేయాలని పేర్కొన్నారు. పాఠశాలలకు మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బియ్యాన్ని సరఫరా చేయాలన్నారు. హైస్కూళ్లలో రిటైర్మెంట్ కారణంగా ఏర్పడిన సబ్జెక్ట్ టీచర్ ఖాళీలను వెంటనే వర్క్ అడ్జస్ట్‌మెంట్ లేదా క్లస్టర్ ఉపాధ్యాయులతో భర్తీ చేయాలని విన్నవించారు. ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



డీఈఓను కలిసిన నేతలు

క్లుప్తంగా

కరేడులో జూడో సెలక్షన్స్ రేపు

ఉలవపాడు: మండల పరిధిలోని కరేడు గ్రామంలో ఆదివారం సబ్ జూనియర్ జూడో సెలక్షన్స్ జరుగుతాయని ఆ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు కరేడులోని ఉన్నత పాఠశాల సమీపంలోని ప్రైవేట్ మైదానంలో ఎంపికలు జరుగుతాయన్నారు. 2011 నుంచి 2013 సంవత్సరాల మధ్య జన్మించిన వారు అర్హులన్నారు. ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకురావాలని కోరారు. ఎంపికైన వారు జిల్లా తరఫున గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు 89190 36160 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం



మర్రిపాడు: మండలంలోని కదిరినేనిపల్లి బేస్ క్యాంప్ సిబ్బంది ఉదయగిరి వెలిగొండ అడవుల్లో శుక్రవారం పది ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. డిప్యూటీ రేంజ్ అధికారి రవీంద్రబాబు, శివకుమారి ఆధ్వర్యంలో బేస్ క్యాంప్ సిబ్బంది తనిఖీలు నిర్వహించి దుంగల్ని గుర్తించారు. వాటి విలువ సుమారు రూ.3 లక్షల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. దుంగలను క్యాంపునకు తరలించారు.

గనుల్లో గద్దలు

ఓ ముఖ్యనేత కనుసన్నల్లో మైనింగ్

- కప్పం కడితే రైట్.. రైట్
- సిండికేట్ ఉచ్చులో పరిశ్రమ
- 20 నుంచి 30 శాతం వరకూ అనధికారిక రాయల్టీ
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- బెంబేలెత్తుతున్న యజమానులు

గనులను పీల్చిపిప్పి చేయడంలో ఆ పెద్దనేత దిట్ట. మైనింగ్ పరిశ్రమలో అనధికారిక ఆంక్షలు పెడుతూ గనుల యాజమాన్యాలను కొన్నినెలలుగా ముప్పతిప్పలు పెడుతున్నారు. కానీ ఆ ముఖ్యనేతలకు కప్పం కడితే ఇతర ప్రాంతాలకు తరలించేందుకు రైట్.. రైట్ చెబుతున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో ఆయనకు రాష్ట్ర స్థాయిలో పెద్దనేతలతో సంబంధాలు ఉండటంతో అధికారులు కూడా కిమ్మనడం లేదు. ఖనిజ విలువలో కొంత మొత్తం వసూలు చేసుకుని దర్జాగా దోచేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది.

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి గనులను దోచుకునేందుకు రకరకాల ఛూహోళ్లతో మైనింగ్ పరిశ్రమ కుదేలైంది. గడిచిన 14 నెలలుగా ఈ పరిశ్రమపై వివిధ ఆంక్షలు పెడుతూ చివరకు ఓ పెద్దనేతకు అప్పనంగా అప్పగించేశారు. సిండికేట్‌కు కప్పం కడితే ఖనిజాన్ని ఇతర ప్రాంతాలకు తరలించేందుకు అన్నీ అనుమతులు ఇచ్చేస్తున్నారు. వారి కనుసన్నల్లోనే మైనింగ్ పరిశ్రమ ప్రస్తుతం నడుస్తోంది. కనీవినీ ఎరుగని రీతిలో ఖనిజ విలువలో 20 నుంచి 30 శాతం వరకు వసూలు చేసుకుని తమ జేబులను నింపుకొంటున్నారు. అదీ కాకుండా ఓ ముఖ్యనేతకు అందులోంచి మరో 2 నుంచి 3 శాతం వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఖనిజ విలువ కూడా గతంలో కన్నా తగ్గుముఖం పట్టడంతో గనుల యాజమాన్యం లబోదిబోమంటోంది.

అంతర్జాతీయంగా డిమాండ్

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో భూగర్భ గనులు 7 కాగా 140 మైకా, క్వార్ట్జ్ గనులతోపాటు గూడూరులో 75 సిలికా ఇసుక గనులున్నాయి. వీటిపై ఆధారపడిన పరిశ్రమలు మరో 100కు పైగా నడుస్తున్నాయి. ఈ యూనిట్లన్నీ ఇక్కడ లభించే ముడి ఖనిజంపై ఆధారపడుతున్నాయి. పరిశ్రమపై ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మంది కూలీలు ఉపాధి పొందుతున్నారు. ప్రధానంగా అంతర్జాతీయ మార్కెట్‌లో వెంకటగిరి నియోజకవర్గంలోని అంతర్భాగమైన సైదాపురం మండలంలో లభించే మైకా క్వార్ట్జ్, మైకా జపాన్, చైనా, రష్యా దేశాలకు ఎగుమతి అవుతోంది.



ఖనిజాన్ని వేరు చేసే యంత్రాలు

ఖనిజం కోసం విదేశీ ప్రతినిధులు

సైదాపురం, గూడూరు నియోజకవర్గాల్లో 30 గనుల్లో నాణ్యమైన మైకా క్వార్ట్జ్ లభిస్తోంది. ప్రధానంగా చైనా కంపెనీలు కొనుగోలు చేస్తున్నాయి. దాని కోసం నిత్యం ఇతర దేశాల ప్రతినిధులు వస్తుంటారు. మరో వందేళ్ల వరకు పుష్కలంగా నిల్వలున్నాయి. గతంలో ఈ ఖనిజం పనికి రాకపోవడంతో ఎక్కడ పడితే అక్కడ గుట్టలుగా వదిలేసేవారు. ప్రస్తుతం స్థానికంగానే రూ.25 వేల నుంచి రూ.2 లక్షల ధర పలుకుతుండటంతో నిలువునా దోచుకుంటున్నారు. సైదాపురం, గూడూరు మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి రోజూ 500 టన్నుల మైకా క్వార్ట్జ్ సిండికేట్ అనుమతితో ఇతర ప్రాంతాలకు తరలుతోంది.

యజమానులకే హక్కు కల్పించాలి



మైనింగ్ పరిశ్రమను ప్రభుత్వం కాపాడాలి. సిండికేట్ చేతుల్లోంచి యజమానులకే హక్కు కల్పించాలి. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. గిట్టుబాటు ధర లభించకపోవడంతో కూలీలు ఆకలి కేకలతో అలమటిస్తున్నారు.

– డీపీ పోలయ్య, రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు



అధిక టన్నేజీతో ఖనిజాన్ని తరలిస్తూ..

సిండికేట్ వసూళ్లు ఇలా..



30 గనుల్లో లభించే మైకా క్వార్ట్జ్‌ను దిగుమతి చేసేందుకు చైనా, జపాన్ దేశాల్లో అనుమతి ఉంది. దీంతో ఆయా గనుల నుంచి వచ్చే ఖనిజాలను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇక్కడ లభించే ఖనిజం రకాలను బట్టి రూ.20 వేల నుంచి రూ.85 వేల వరకు ధర పలుకుతోంది. టన్ను రూ.20 వేల చొప్పున అమ్మితే సిండికేట్‌కు రూ.4 వేలు కప్పం కట్టాలి. అదే టన్ను రూ.85 వేలకు అమ్మితే రూ.20 వేల పైన ఇవ్వాలి. దానికితోడు మరో ముఖ్యనేతలకు ఇవ్వాల్సి వస్తోంది. దీంతో గనుల యజమానులు లబోదిబోమంటున్నారు. అలాగే కొన్ని యార్డులకు కూడా అనుమతులను మంజూరు చేశారు. వాటికి కూడా ఆ వంతునే నగదును సిండికేట్‌కు చెల్లించాలి. ముఖ్యంగా సైదాపురం మండలంలో వివిధ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను కూడా సిండికేట్ రాయుళ్లు ఏర్పాటు చేసి నిఘా పెట్టారు. కార్యాలయం కూడా సైదాపురం – ఊటుకూరు మధ్యలో ఏర్పాటు చేయడం గమనార్హం.



ఖనిజాన్ని వెలికి తీసేందుకు భారీ యంత్రాలను తీసుకొస్తూ..

మైనింగ్ ఆపాలంటూ రాస్తారోకో



ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీసులు

వరికుంటపాడు: వరికుంటపాడు పంచాయతీ పరిధిలోని జంగంరెడ్డిపల్లి పల్లతిప్పలో మైనింగ్ కార్యకలాపాలు వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానికులు మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రోడ్డుపై బైఠాయించారు. దీంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. వారు మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణలో అందరూ ముక్తకంఠంతో మైనింగ్ రద్దు చేయాలని కోరామన్నారు. అయినా లీజు హక్కుదారులు తమ కార్యకలాపాలు ఆపలేదని, దీంతో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను కలిసి తమ గోడు వినిపించామన్నారు. వారి నుంచి స్పందన రాకపోవడంతో జేఏసీ ఏర్పాటు చేసి ఆందోళనకు దిగినట్లుగా చెప్పారు. మైనింగ్ చేస్తే నాలుగు గ్రామాల ప్రజల జీవనాధారం కోల్పోవడమే కాకుండా జంగంరెడ్డిపల్లిని వేరే ప్రాంతానికి తరలించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మైనింగ్‌ను రద్దు చేయకపోతే న్యాయస్థానాల్లో న్యాయపోరాటానికి సిద్ధమవుతామని తెలిపారు. ట్రాఫిక్ సమస్య ఏర్పడటంతో ఎస్సై రఘునాథ్ తన సిబ్బందితో వెళ్లి ఆందోళనకారులతో మాట్లాడి రాస్తారోకోను విరమింపజేశారు.

జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోండి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ ఆనంద్

ఆత్మకూరు: జాబ్‌మేళాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని ఆంధ్రా ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ప్రభుత్వ సలహాదారు, డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ గుండ్రా సతీష్‌రెడ్డి సహకారంతో భారీ జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనం మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా, నేరుగా మొత్తం 2,347 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. 93 కంపెనీలు పాల్గొన్నట్లు చెప్పారు. కలెక్టర్ ఒ.ఆనంద్, టిడ్కో చైర్మన్ అజయ్ కుమార్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజీజ్, ఆర్టీసీ రీజినల్ చైర్మన్ సురేష్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కానిస్టేబుళ్ల తుది ఫలితాల విడుదల

నెల్లూరు(క్రైమ్): కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి సంబంధించిన తుది ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఎంపికైన 158 మందితో కూడిన ఫైనల్ లిస్టును అధికారులు జిల్లా పోలీసు కార్యాలయంలో అందుబాటులో ఉంచారు. వీరు త్వరలో తొమ్మిదినెలలపాటు శిక్షణకు వెళ్లనున్నారు.

అవయవదానంతో 8 మందికి పునర్జన్మ

- జీవన్‌దాన్ ఏపీ చైర్మన్ రాంబాబు



మాట్లాడుతున్న డాక్టర్ రాంబాబు

నెల్లూరు(అర్బన్): అవయవదానంతో ఎనిమిది మందికి పునర్జన్మ ప్రసాదించవచ్చని జీవన్‌దాన్ ట్రస్ట్ ఏపీ చైర్మన్ డాక్టర్ రాంబాబు అన్నారు. శుక్రవారం సాయంత్రం నెల్లూరులో ఓ కన్వెన్షన్ హాల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం అపోలో ఆస్పత్రిలో క్యాంప్ ఉంటుందన్నారు. బ్రెయిన్‌డెడ్ అంటే ఏంటి?, అవయవదానాన్ని చట్టబద్ధంగా ఎలా చేయాలి? అనే అంశాలను వివరిస్తామన్నారు. మూడో తేదీన నేషనల్ ఆర్గాన్ డొనేషన్‌డేను పురస్కరించుకుని వీఆర్‌సీ సెంటర్ నుంచి భారీ ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో కార్యక్రమం జరుగుతుందన్నారు. జీవన్‌దాన్ సంస్థలో ఇప్పటికే 4,733 మంది అవయవాల కోసం రిజిస్టర్ చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో వివిధ ఆస్పత్రుల ప్రతినిధులు డాక్టర్ శ్రీరాంసతీష్, బాలరాజు, డాక్టర్ సతీష్, శేఖర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 26.224 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 26.224 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 1,750, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 70, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వైఎస్సార్‌సీపీ నేత మలిరెడ్డి కోటారెడ్డి

ధైర్యంగా ఉండండి.. అండగా ఉంటాం

- గిరిజన మహిళలకు బుర్రా భరోసా



గిరిజన మహిళలను పరామర్శిస్తున్న మధుసూదన్ యాదవ్

ఉలవపాడు: 'మీరు ధైర్యంగా ఉండండి.. అండగా ఉంటా. ఏ కష్టం వచ్చినా తోడుగా ఉంటా' అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ కందుకూరు ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ గిరిజన మహిళలకు భరోసా ఇచ్చారు. రామకృష్ణాపురం గిరిజన మహిళలు బెయిల్‌పై విడుదల కావడంతో వారిని శుక్రవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయ కక్షలో భాగంగా కేసులు నమోదయ్యాయి కాబట్టి, బాధపడాల్సిన అవసరం లేదన్నారు. ఇండోసోల్ కంపెనీకి భూములు ఇవ్వలేదని ప్రభుత్వం పెట్టిన కేసని అర్థమైందన్నారు. మహిళల్ని అర్ధరాత్రి అరెస్ట్ చేయకూడదన్నారు. కానీ పోలీసులు భయభ్రాంతులకు గురిచేయడానికి ఇలా చేశారన్నారు. నెల్లూరుకు వచ్చిన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కేసు గురించి తెలియజేశానన్నారు. జగనన్న రైతులకు అండగా ఉండాలని తెలియజేశారన్నారు. న్యాయవాదులతో మాట్లాడతానన్నారు. గిరిజన మహిళలు శిరీష, లలితమ్మ, సునీతలు తమను పోలీసులు అర్ధరాత్రి తీసుకుని వెళ్లి చాలా ఇబ్బంది పెట్టారని తెలిపారు. ఎంత భయపెట్టినా తాము మాత్రం భూములు ఇచ్చేది లేదన్నారు. కరేడు గ్రామ రైతులందరూ వచ్చి ధర్నా చేయడం వల్ల సెక్షన్ తగ్గించారని, అందువల్లే బెయిల్ వచ్చిందని వారు బుర్రాకు తెలిపారు. మాజీ సీఎం జగన్‌ను కరేడుకు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నన్నం పోతురాజు, కరేడు గ్రామ కన్వీనర్ సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

పామాయిల్ ఫ్యాక్టరీ కార్మికులకు స్వల్ప గాయాలు

ముత్తుకూరు(పొదలకూరు): మండలంలోని పంటపాళెంలో ఉన్న బుంగి పామాయిల్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులు కెమికల్ నీరు కలిసిన ప్రాంతంలో నడవడంతో గాయపడ్డారు. సేకరించిన సమాచారం మేరకు వివరాలు.. శుక్రవారం ఫ్యాక్టరీని శుభ్రం చేసేందుకు నీటిలో కెమికల్ కలిపినట్టుగా తెలుస్తోంది. నలుగురు కార్మికులు ఆ నీటిపై నడవడంతో వారి కాళ్లకు బొబ్బలు రేగి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే యాజమాన్యం ముత్తుకూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వారికి చికిత్స చేయించింది. నలుగురికి ప్రమాదమేమీ లేదని, కోలుకుంటున్నట్లు తెలిసింది.

కసుమూరు దర్గాలో భక్తుల నిలువు దోపిడీ

- హుండీలో కానుకలు వేయకుండా అడ్డుకున్న ముజావర్లు



ముజావర్లతో భక్తుల వాగ్వాదం

వెంకటాచలం: దక్షిణ భారతదేశంలో ఎంతో ప్రసిద్ధి చెందిన మండలంలోని కసుమూరు మస్తాన్‌వలీ దర్గాలో కొందరు ముజావర్ల కారణంగా భక్తులు నిలువు దోపిడీకి గురయ్యారు. శుక్రవారం కావడంతో ఉదయం నుంచి దర్గాకు భక్తులు పోటెత్తారు. వారు తమకు తోచిన కానుకలు (నగదు) హుండీల్లో వేస్తుండగా కొందరు ముజావర్లు తమ చేతికివ్వాలని డిమాండ్ చేశారు. పలువురు భక్తులు చేసేదేమీలేక కానుకలు సమర్పించి వెళ్లారు. కొందరు మాత్రం ఎదురు తిరిగి మీకెందుకు ఇవ్వాలని ప్రశ్నించారు. హుండీల్లో కానుకలు వేసేందుకు ఒప్పుకోమని చేతికి ఇవ్వాల్సిందేనని ముజావర్లు పట్టుబట్టారు. వారి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. భక్తితో దర్గాకు వస్తే బలవంతపు వసూళ్లకు పాల్పడతారా అంటూ భక్తులు మండిపడ్డారు. అధికారులు జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై దర్గా కేర్ టేకర్ అస్లాం మాట్లాడుతూ వివాదం గురించి తెలిసిన వెంటనే ముజావర్లు వసూళ్లకు పాల్పడకుండా చేశామని తెలిపారు. మరోసారి ఇలా జరిగితే వక్ఫ్ బోర్డు దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు.

అథ్లెటిక్స్ ఎంపికలు రేపు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈనెల 3వ తేదీన సౌత్‌జోన్ మీట్ కమ్ సెలక్షన్స్ జరగనున్నాయని ఆ అసోసియేషన్ అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలు 14, 16, 18, 20 సంవత్సరాల్లోపు బాలబాలికలకు ఉదయం 9 గంటలకు జరుగుతాయన్నారు. హాజరయ్యే వారు ధ్రువీకరణపత్రాలతో హాజరు కావాలన్నారు. ఆర్గనైజర్ విజయకుమార్‌ను 94418 75190కు ఫోన్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులు బాపట్లలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్:	రూ.114
లేయర్ :	రూ.112
బ్రాయిలర్ చికెన్:	రూ.210
స్కిన్‌లెస్ చికెన్:	రూ.234
లేయర్ చికెన్:	రూ.190

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	:రూ.24
సన్నవి	:రూ.15
పండ్లు	:రూ.5